## బిఆర్ఎస్ మెదక్ అభ్యర్థిగా పద్మా దేవేందర్‌రెడ్డి నామినేషన్



4 లో




# మనం

## మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

బుధవారం | 8 | నవంబర్ | 2023 | పేజీలు : 8


# కేసీఆర్ పాలన అవినీతిమయం

- కల్వకుంట్ల కుటుంబం ఒక్కటే బాగుపడ్డది
- ఈటల రాగానే కేసీఆర్ ఉరికిండు
- రాములోరి పెళ్లికి ఎందుకురాలే?
- రాష్ట్ర బీజేపి అధ్యక్షులు కిషన్‌రెడ్డి

గజ్వేల్/ జగదేవ్‌పూర్, నవంబర్ 07, మనం న్యూస్: ఆత్మబలి దానాలు, అమరుల త్యాగం, సబ్బండ తెలంగాణ ప్రజల పోరాటంతో సాధించుకున్న తెలంగాణ నేడు ఒక్క కుటుంబం కోసమే అన్న చందంగా మారిందని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. మంగళవారంనాడు





గజ్వేల్ నియోజకవర్గ బీజేపి అభ్యర్థిగా ఈటల రాజేందర్ నామినేషన్ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా కోట మైసమ్మ దేవాలయం మిగతా 2లో..

# జనగామ సమగ్రాభివృద్ధే ధ్యేయం

- ఆశీర్వదిస్తే ఐదేళ్లు సేవకుడిగా పని చేస్తా
- నామినేషన్ వేసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- అపూర్వ స్వాగతం పలికిన ప్రజలు, పార్టీ శ్రేణులు
- జనసంద్రమైన జనగామ



కొమురవెల్లి, నవంబర్ 07, మనం న్యూస్: జనగామ సమగ్రాభివృద్ధికి పని చేస్తానని, నియోజక వర్గ ప్రజలు ఆశీర్వదిస్తే ఐదేళ్లు సేవకుడిగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ బిఆర్ ఎస్ అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం జనగామ ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు గ్రామాల నుండి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చారు. మహిళలు మంగళహారతులతో, బోనాలు, బతుకమ్మలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసం నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు యువత భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా అభిమానులు నృత్యాలు చేశారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం పల్లా రాజేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో

మిగతా 2లో..

# దుబ్బాక పులి రఘునందన్‌రావు



- రాష్ట్రంలో బీజేపి గెలుపు దుబ్బాక నుండే మొదలు
- బీజేపి జాతీయ అధికార ప్రతినిధి డా. సంబిత్ పాత్రా
- దుబ్బాక ప్రజల ఆశీస్సులతో మరోసారి బీజేపిదే గెలుపు
- నామినేషన్ దాఖలు చేసిన దుబ్బాక బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు

2 లో

# కేసీఆర్ పాలన అవినీతిమయం

మొదటి పేజీ తరువాయి..

వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుర వీధుల మీదుగా రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కమీషన్‌ల కోసం కట్టిన కాళేశ్వరం చివరకు సీఎం కేసీఆర్ ఫామ్‌హౌజ్ కోసమే అన్న చందంగా మారిందన్నారు. కాళేశ్వరంలోని నీళ్లు ఎర్రవల్లిలోని సీఎం ఫామ్‌హౌజ్‌కే వస్తున్నాయన్నారు. మోసం చేయడం కేసీఆర్ నైజమని, నాడు పార్టీని విలీనం చేస్తానని, మరోమారు రాజకీయాలు తనకొద్దని, ఇంకోమారు దళితున్ని సీఎం చేస్తానంటూ అందరినీ మోసం చేసిన ఘనుడు కేసీఆర్ అన్నారు. అధికారం ఇచ్చిన తెలంగాణ ప్రజలను ఏనాడూ పట్టించుకోలే.... ఏనాడూ కలవలే... ఎన్నికలు రాగానే మళ్లీ ముందుకు వస్తున్నాడని ప్రజలు జాగరూకతతో ఉండాలన్నారు. మజ్లీస్ దావత్‌లకు క్రిస్టియన్‌ల విందుకు వెళ్లేం





దుకు తీరిక ఉన్న సీఎంకు భద్రాద్రిలో రాములోరి కళ్యాణానికి వచ్చే తీరిక లేకుండాపోయిందన్నారు. గజ్వేల్‌కు ఈటల రాజేందర్ వస్తున్నాడని తెలియగానే ఓటమిని ముందే ఊహించి కేసీఆర్ కామారెడ్డికి పారిపోయాడన్నారు. కేసీఆర్ ఎక్కడికి వెళ్లినా ఈమారు ఓటమి తప్పదన్నారు. తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకున్న కేసీఆర్ కుటుంబం భూములు, బంగ్లాలు కొంటుందని, అవినీతిమయమైన కల్వకుంట్ల కుటుంబాన్ని ఫామ్‌హౌజ్‌కే పరిమితం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముమ్మాటికీ బీజేపిదే అధికారమని, ఏ పార్టీతో పొత్తు పెట్టుకోము, భవిష్యత్తులో కూడా ఆ పరిస్థితి రాదన్నారు. గజ్వేల్ నియోజకవర్గ అభ్యర్థి ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు విసుగు చెందారని, బిఆర్ఎస్ పాలన చూసి అసహ్యించుకుంటున్నారని, ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, ఎప్పుడు ఈ



పాలనకు చరమగీతం పాడుదామా అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. బిఆర్ఎస్‌ను బొందపెట్టే శక్తి కేవలం బీజేపికి మాత్రమే ఉందన్నారు. నాయకుల్లో స్వార్థం ఉండొచ్చు కానీ, ప్రజలంతా ఏకపక్షంగా బీజేపివైపే ఉన్నారన్నారు. గజ్వేల్‌లో కేసీఆర్ అహంకారాన్ని అణచాల్సిన అవసరం ఉందని, రాక్షస పాలనను పారద్రోలేందుకే మీ అందరి కోరిక మేరకు ఇక్కడికి వచ్చానన్నారు. కేసీఆర్ కుటుంబానికి, తెలంగాణ ప్రజలకు మధ్య జరుగుతున్న ఎన్నిక అని, కేసీఆర్ అహంకారానికి, తెలంగాణ ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్న యుద్ధంలో ధర్మమే గెలుస్తుందన్నారు. భారీగా హాజరైన జనం ఈటల రాజేందర్ నామినేషన్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో ప్రజలు రావడంతో బీజేపి శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది.

## జనగామ సమగ్రాభివృద్ధే ధ్యేయం



మొదటి పేజీ తరువాయి..

జనగామ బిఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశానన్నారు. నియోజకవర్గ పెద్దలు పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ తాటికొండ రాజయ్య, బోడకుంటి వెంకటేశ్వర్లు,



మండల శ్రీరాములు, సిద్ధిరాముల, పోకల జమున, టౌన్ అధ్యక్షులు సురేష్ నాయకత్వంలో రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశానని పేర్కొన్నారు. జనగామ సమగ్రాభివృద్ధి కోసం ప్రజలంతా బిఆర్ఎస్ అభ్యర్థులను ఎన్నుకోవాలని కోరారు. జనగామ నియోజకవర్గం ఇప్పటి వరకు చాలా అభివృద్ధి చెందిందని, ఇంకా అభివృద్ధి కావాలని, సీఎం కేకేసీఆర్ సహకారం, నియోజకవర్గ పెద్దల సలహాలు, సూచనలతో అభివృద్ధిని వేగవంతం చేస్తానని హామీ ఇచ్చారు. అయితే ప్రజల సంపూర్ణ సహకారంతో జనగామ ఎమ్మెల్యేగా తప్పకుండా గెలుపొందుతానన్న విశ్వాసం తనకుందన్నారు. నియోజకవర్గ పెద్దల సహకారంతో ఎన్నికల రణరంగంలో దిగుతానని, ఇప్పటి వరకు ప్రజాప్రతినిధులుగా ఉన్న వారి సలహాలు, సూచనలు పాటిస్తూ జనగామపై బిఆర్ఎస్ జెండాను ఎగురవేస్తానని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రణాళికతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జనగామకు చెందిన ప్రజాప్రతినిధుల సహకారంతో నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పని చేస్తానని తెలిపారు.

## దుబ్బాక పులి రఘునందన్‌రావు

దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 07, మనం న్యూస్ః ప్రజల పక్షాన నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ దుబ్బాకకు రావాల్సిన నిధులు ప్రభుత్వం మెడలు వంచి తెప్పిస్తూ అభివృద్ధి చేస్తూ రఘునందన్‌రావు దుబ్బాక నియోజకవర్గ పులిగా మారారని, ఈ పులి ముందు ఎవరైనా పిల్లులే అని బీజేపి జాతీయ అధికార ప్రతినిధి డా. సంబిత్ పాత్రా పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దుబ్బాక నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా మాధవనేని రఘునందన్‌రావు మంగళవారం రోజున మాజీ ఎంపి జితేందర్‌రెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి డా. సంబిత్ పాత్రాలతో కలిసి దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరిమా అగ్రవాల్‌కు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా డా. సంబిత్ పాత్రా మాట్లాడుతూ గత ఉప ఎన్నికల్లో దుబ్బాకలో బీజేపి గెలుపుతో రాష్ట్రవ్యాప్తంగా బీజేపికి బలం పెరిగిందని, తదనంతరం జరిగిన జిహెచ్ఎంసి ఎన్నికల్లో నాలుగు సీట్లు ఉన్న బీజేపి ఏకంగా 48 సీట్లు సాధించడానికి పునాది దుబ్బాకే అన్నారు. ఇప్పుడు 2023లో సైతం రాష్ట్ర వ్యాప్తంగా బీజేపి గెలుపునకు దుబ్బాక నియోజకవర్గంలో బీజేపి గెలుపే నాంది కానుందని, దుబ్బాక పులి రఘునందన్‌రావు గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. తాను హైదరాబాద్ నుండి వస్తుండగా దుబ్బాక నియోజకవర్గంలోకి అడుగుపెట్టినప్పటి నుండి నామినేషన్ పత్రాలు సమర్పించిన అనంతరం సైతం ప్రజలు, మహిళలు రఘునందన్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆశీర్వదించడంతోనే ఆయన



గెలుపు ఖాయమైందన్నారు. అనంతరం బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు మాట్లాడుతూ 2020 నవంబర్ ఉప ఎన్నికల్లో వచ్చిన ఫలితాల ద్వారా తనకు ఇచ్చిన కాస్త సమయంలోనే నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు, ప్రజల ఆశీస్సులే తనను మరోసారి గెలిపిస్తాయన్నారు. అధికారంలోకి రాకముందు దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానన్న కేసీఆర్ నాటి నుండి నేటి వరకు ప్రజలకు ఇచ్చిన ఎన్నో హామీలను విస్మరించారన్నారు. కానీ దళితుల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి స్వయంగా ప్రధాని మోదీయే ఈ నెలలో రెండుసార్లు రాష్ట్రంలో పర్యటించి వారికి శుభవార్తను ప్రకటించనున్నారని, దీంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న ఆందోళనకు తెరపడనుందన్నారు. అదేవిధంగా దుబ్బాక నియోజకవర్గంలో బీజేపి నాయకులు, కార్యకర్తల కృషి పట్టుదలతోపాటు ప్రజల ఆశీస్సులతో తాను మరోసారి గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి పూర్తిస్థాయిలో అవకాశమిస్తే దుబ్బాక నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. నామినేషన్‌కు ముందుగా తమ స్వగ్రామం బొప్పాపూర్‌లో బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించిన అనంతరం దుబ్బాక మారెమ్మతల్లి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నామినేషన్‌కు బయల్దేరారు.



# జిల్లా సారథికే టికెట్టు

## -ఉత్కంఠకు తెర... దూదికే అవకాశం
## -స్థానిక నేతల్లో ఆనందం





సిద్దిపేట, నవంబర్ 07, మనం న్యూస్ ప్రతినిధి: నామినేషన్ల పర్వం మరికొద్ది గంటల్లో ము గుస్తున్న వేళ ఎట్టకేలకు భార తీయ జనతా పార్టీ నాలుగో విడత లిస్టులో ఉత్కంఠకు తెర దించింది. మొదటి మూ డు విడతల్లో సిద్దిపేట అభ్యర్థి పేరు ఉంటుందని ఆశించిన కార్యకర్తల ఆశలను వమ్ము చేస్తూ అధి ష్టానం ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో ఒకదశలో కార్యకర్తల్లో నైరాశ్యం పెరి గింది. రాష్ట్ర వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ జనసేనతో స్నేహపూరిత ఒప్పం దం కుదు ర్చుకున్న నేపథ్యంలో సిద్దిపేట టిక్కెట్‌ను జనసేనకే కేటాయిస్తారన్న ఊహాగానాలూ వెలువెత్తాయి. గత రెండు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీయే తన ఊపిరిగా పని చేస్తున్న యువకుడు దూది శ్రీకాంత్‌రెడ్డికి టికెట్ వస్తుందని మొదట ఆశించినప్పటికీ మూడు విడుదల జాబితాల్లోనూ సిద్దిపేట పేరు లేకపోవడంతో అసలు శ్రీకాంత్‌రెడ్డికి టికెట్ వస్తుందా లేదా అన్న అయోమయం నెలకొంది. ఏబివిపి, భారతీయ జనతా యువమోర్చ, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రస్తుతం జిల్లా సారథిగా కొనసాగుతున్న నాలుగు పదుల యువకుడు దూది శ్రీకాంత్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని స్థానిక నేతల నుండి ఎంత ఒత్తిడి ఎదురైనా అధిష్టానం టిక్కెట్ పేరును ప్రకటించడంలో నాన్చుతూ వచ్చింది. ఈ క్రమంలో కొంతమంది గత మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు సైతం పార్టీని వీడారు. సిద్దిపేట టిక్కెట్టుపై రాష్ట్ర స్థాయిలో జరిగిన అంతర్మథనంలో హరీష్‌రావును ఢీకొట్టే సరైన అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డే అని గ్రహించి నాలుగో విడత లిస్టులో పేరును ఖరారు చేసింది. నియోజకవర్గ సమస్యలపై పూర్తి పట్టు ఉన్న శ్రీకాంత్‌రెడ్డి న్యాయవాద వృత్తినీ పూర్తి చేశాడు. గతంలో కౌన్సిలర్‌గా పని చేసి ఫ్లోర్ లీడర్‌గా పని చేసిన అనుభవమూ ఉంది. చిన్నప్పటి నుండి సిద్దిపేటలోనే విద్యాభ్యాసాన్ని కొనసాగించిన శ్రీకాంత్‌రెడ్డికి బంధుమిత్రుల గణము, సంఖ్య ఎక్కువే. గత ఎన్నికల్లోనే టికెట్ వస్తుందని ఆశించినప్పటికీ భంగపడ్డ శ్రీకాంత్‌రెడ్డి ఎట్టకేలకు అధిష్ఠానం ఆశీస్సులు పొంది టిక్కెట్ పొందగలిగాడు. సిద్దిపేటలో తిరుగులేని శక్తిగా వెలుగొందుతున్న హరీష్‌రావును ఏ విధంగా ఎదుర్కొంటాడన్నదే వేచి చూడాల్సిన అంశం.

### -స్థానిక నేతల సంబరాలు

కరుడుగట్టిన కాషాయవాదిగా పేరున్న శ్రీకాంత్‌రెడ్డి గత కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలతోపాటు హిందూ ధార్మిక కార్యకలాపాల్లో ముఖ్యపాత్ర పోషిస్తూ వచ్చాడు. ఏ కార్యక్రమం జరిగినా శ్రీకాంత్‌రెడ్డి లేని కార్యక్రమం జరిగింది లేదంటే అతిశయోక్తి కాదు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించడంలో కానీ, దత్తాత్రేయ వారసత్వాన్ని కొనసాగిస్తూ అలాయ్‌బలాయ్ నిర్వహించడంలో కానీ, ఇటీవల వీర హనుమాన్ జయంతి శోభాయాత్రను నిర్వహించడంలో గానీ శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక గుర్తింపును పొందారు. ఏదేమైనా కరుడుగట్టిన కాషాయ వాది హిందుత్వ వాదిగా పేరొందిన శ్రీకాంత్‌రెడ్డికి టికెట్ రావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



## అభివృద్ధికి మారుపేరు బిఆర్ఎస్
### డిసిసిబి ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక, నవంబర్ 07, మనం న్యూస్: తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధికి మారుపేరు, కేరాఫ్ అడ్రస్ బిఆర్ఎస్ ప్రభుత్వం అని డిసిసిబి ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు దేవి రవిందర్ అన్నారు. మంగళవారం కొండపాక మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరాయన్నారు. మరోసారి సీఎంగా కేసీఆర్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారని ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్, మాజీ ఎంపిపి అనంతుల పద్మ నరేందర్, స్థానిక సర్పంచ్ ఆరెపల్లి మహదేవ్ గౌడ్, ఎంపిటిసిలు గురజాడ బాలాజీ, నాయకులు గోనె శ్రీనివాస్, పిల్లి నాగరాజు, ఉప సర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ
### దుబ్బాక స్థానానికి నేటి వరకు పది నామినేషన్ల దాఖలు

దుబ్బాక టౌన్, నవంబర్ 07, మనం న్యూస్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల దృష్ట్యా దుబ్బాక నియోజకవర్గ స్థానానికి బరిలో నిలిచేందుకు ఆయా పార్టీలతోపాటు పలువురు స్వతంత్రులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. కాగా మంగళవారం రోజున నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరిమా అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ జనతా పార్టీ తరుపున మాధవనేని రఘునందన్‌రావు, బహుజన సమాజ్‌వాది పార్టీ తరుపున సలకం మల్లయ్య, యుగతులసి పార్టీ తరుపున ఆది వేణుగోపాల్, ప్రజా ఏక్తా పార్టీ తరుపున దుత్వల నరేష్‌లు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. కాగా నేటి వరకు పూర్తిగా పది నామినేషన్లు దాఖలైనట్లు ఆమె తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన తొగుట సర్పంచ్ కొండల్‌రెడ్డి

## సాదరంగా ఆహ్వానించిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



తొగుట, నవంబర్ 07, మనం న్యూస్: మండల కేంద్రమైన తొగుట గ్రామ సర్పంచ్ పాగల కొండల్‌రెడ్డి దుబ్బాక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సర్పంచ్‌తోపాటు బిఆర్ఎస్ నాయకులు పబ్బతి మల్లారెడ్డి, దశమంత్‌రెడ్డి, పబ్బతి దయాకర్‌రెడ్డి, ముచ్చర్ల మల్లేశం, గోవర్ధనగిరి, బిఆర్ఎస్ వార్డు సభ్యులు ఉప్పరి లింగం, ఎల్లారెడ్డిపేట యూత్ సభ్యులు మన్నె లక్ష్మణ్ , నర్మెట ప్రశాంత్, నాంపల్లి శేఖర్, అల్లమెల్లి నాగరాజు, కొత్త హరీష్ తదితరులు కాంగ్రెస్‌లో చేరగా వారికి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొగుట సర్పంచ్‌తోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో తొగుట మండలంలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద మొత్తంలో ఆధిక్యత రావడానికి కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో దుబ్బాకలో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం కోసం పాటు పడే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికి తిరిగి పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గాంధారి లత నరేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, మాజీ ఎంపిపి గంట రేణుక రవిందర్, ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ బుర్ర నర్సింలు గౌడ్, తుక్కాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు విజయ్‌రెడ్డి, తొగుట మాజీ సర్పంచ్ కొంగరి నర్సింలు, జిల్లా నాయకులు ఎన్నం భూపాల్‌రెడ్డి, బూస నిరంజన్‌రెడ్డి, ఫిషర్‌మెన్ రాష్ట్ర కార్యదర్శి రేపాక తిరుపతి, కిసాన్ సెల్ అధ్యక్షులు సిద్ది శ్రీనాకర్‌రెడ్డి, ముచ్చర్ల కనకయ్య, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బిసి ఆత్మగౌరవ సభకు తరలిన బీజేపి శ్రేణులు



సిద్దిపేట అర్బన్, నవంబర్ 07, మనం న్యూస్: ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటున్న బిసి ఆత్మగౌరవ సభలో హాజరయ్యేందుకు బీజేపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం భారీగా బీజేపి శ్రేణులు తరలి వెళ్లారు. సభకు 12 బస్సులు జిల్లా కేంద్రం నుండి బయలుదేరగా శ్రీకాంత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న సభకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. బీజేపి బిసి సీఎం ప్రకటన చేయడంతో బిసి ప్రజల కలలు సాకారం కాబోతున్నాయన్న నినాదంతో సభకు వేలాది మంది తరలి వస్తున్నారన్నారు. రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డితోపాటు ఇదే సభలో జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ సైతం పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు పత్రి శ్రీనివాస్ యాదవ్, ఉపేందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కుమార స్వామి, పర్శరాములు, గోనె మార్కండేయులు, అంబటిపల్లి శ్రీనివాస్, యాదవ్‌రావు, దాబా నరేష్, భోగి శ్రీనివాస్, కృష్ణ, వెంకట్, బీజేపి శ్రేణులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, బీజేపిలతో ప్రజలకు ఒరిగేది శూన్యం



**-ఇచ్చిన హామీలు అమలు చేయని బిఆర్ఎస్, బీజేపి**

**-బిఆర్ఎస్ హయాంలో కుంటుపడిన అభివృద్ధి**

**-కాంగ్రెస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి**

**-ఓటుతో బిఆర్ఎస్, బీజేపిలకు బుద్ధి చెప్పాలి**

**-కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి**

మిరుదొడ్డి, నవంబర్ 07, మనం న్యూస్ః బిఆర్ఎస్, బీజేపి నాయకులు దుబ్బాక నియోజకవర్గంలో ఒరగబెట్టింది ఏమీ లేదని దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండల పరిధిలోని అందె, కొండాపూర్, ధర్మారం, లక్ష్మీనగర్, కాసులాబాద్ గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి ఆయా గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో డప్పు చప్పుళ్ల మధ్య ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా మళ్లీ మోసం చేసేందుకు ప్రజల వద్దకు తిరుగుతున్నారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని మండిపడ్డారు. బీజేపి, బిఆర్ఎస్ పార్టీలకు త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు సూచించారు. కేంద్రంలోని బీజేపి నిత్యావసర ధరలు పెంచుతూ పేద ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూమి, ఇండ్లు లేని వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టిస్తామని మాయమాటలు చెప్పడం జరిగిందన్నారు. రైతురుణమాఫీ చేస్తామన్న కేసీఆర్ గెలిచిన తర్వాత మళ్లీ ఎన్నికలు వచ్చే వరకు కూడా పూర్తిగా రుణమాఫీ చేయలేదన్నారు. అమాయక ప్రజలను మోసం చేస్తున్న బిఆర్ఎస్, బీజేపి పార్టీల నాయకులకు ఓటుతో తగిన సమాధానం చెప్పాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని నాయకులను తరిమికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీమంత్రి దివంగత నేత ముత్యంరెడ్డి చేసిన సేవలు ఇప్పటికీ ప్రజల్లో నిలిచాయన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్న తొమ్మిదేళ్ల కాలంలో దుబ్బాక నియోజకవర్గంలో అభివృద్ధి కుంటు పడిందన్నారు. కమీషన్‌ల కోసమే బిఆర్ఎస్ నాయకులు కాంట్రాక్టర్ల అవతారమెత్తి ప్రజల సొమ్మును కాజేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా అవినీతిమయంలో కూరుకుపోయిన బిఆర్ఎస్ పార్టీకి, ప్రజలను మోసం చేస్తున్న బీజేపి నాయకులకు ఓటుతో సమాధానం చెప్పాలన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మద్దెల రాజేశం, మిరుదొడ్డి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వర్షానికి తడిసిన వడ్లు



కొండపాక, నవంబర్ 07, మనం న్యూస్ః సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి కల్లాల్లో పోసిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. మండల పరిధిలోని బందారం, అంకిరెడ్డిపల్లి, దుద్దెడ, మర్పడగ, రాంపల్లి దర్గా గ్రామాల్లో పోసిన వడ్లు వర్షానికి తడిసిపోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు. గత పదిహేను రోజుల నుండి కోసిన ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టారు. కల్లాల్లోని ధాన్యం వర్షానికి తడిసి ముద్దయ్యాయి. కల్లాల్లో పోసి పది రోజులు గడిచినా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్ర ఎస్సీ గెజిటెడ్ అసోసియేట్ అధ్యక్షుడిగా గొంటి రవి



చేర్యాల, నవంబర్ 07, మనం న్యూస్ః చేర్యాల ప్రభుత్వ జూని యర్ కళాశాలలో కామర్స్ లెక్చర ర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గొంటి రవి రాష్ట్ర ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ లెక్చ రర్స్ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షు లుగా ఎన్నిక కావడం పట్ల కళాశా ల అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తూ గొంటి రవిని అభినం దించారు. ఈ సంద ర్భంగా రాష్ట్ర అసోసియేట్ అ ధ్యక్షులు గొంటి రవి మాట్లాడుతూ అధ్యాపకుల సమ స్యల పరిష్కా రానికి తనవంతు సహకారాన్ని అందించి కృషి చేస్తానని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే బడుగు బలహీన వర్గాల విద్యా ర్థుల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. క్రమబద్ధీకరణ కాని అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందన్నారు. తన ఎన్నికకు సహకరించిన అధ్యాపక మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, మధు, బి. విద్యాసాగర్, కె. శ్రీధర్, ఎల్. పరశురాములు, ఈ. కవిత, కె. స్వప్న, బి. చంద్రమోహన్, బి. అనూష, జి. సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం

**-బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు**

**-వర్గల్ మండలం నుండి భారీగా చేరికలు**

గజ్వేల్, నవంబర్ 07, మనం న్యూస్ః మర్కుక్ మండలంలోని పాతూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌ను వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. త్వరలో జరిగే ఎన్నికల్లో గజ్వేల్ నుండి కేసీఆర్‌కు భారీ మెజార్టీ అందిస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో గుంటుపల్లి స్వామి, బోయిని బాలకృష్ణ రాజు, బాబు రాజు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మల్లేష్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.ప్రజ్ఞా గార్డెన్స్, వైష్ణవి గార్డెన్‌లో మంగళవారం వర్గల్ మండలం మీనాజీపేట, అంబర్‌పేట, మజీద్‌పల్లి, ఆర్ అండ్ ఆర్ కాలనీ, ఎర్రవల్లి గ్రామం నుండి దాదాపు 250 మంది యువకులు, సీనియర్ నాయకులు వివిధ పార్టీల నుండి ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి కేవలం కేసీఆర్‌తో మాత్రమే సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుండి భారీగా బిఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. నామినేషన్ వేయడానికి జనాలను పక్క నియోజకవర్గం దుబ్బాక నియోజకవర్గం నుండి తరలించారని ఎద్దేవా చేశారు. గజ్వేల్‌లో బీజేపికి చోటు లేదన్నారు. కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికే ప్రజలు ఓటు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వర్గ్ ఎంపిపి లత రమేష్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, సర్పంచ్ల ఫోరం అధ్యోఉలు వెంకటేష్, యువజన జిల్లా అధ్యక్షులు నాగరాజు, ఆయా గ్రామాల సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌కు మరో షాక్

**కాంగ్రెస్‌లోకి మాజీ కౌన్సిలర్ బట్టి సులోచన**



మెదక్, నవంబర్ 07, మనం న్యూస్ః మెదక్ బిఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. మెదక్ పట్టణ మాజీ కౌన్సిలర్ బట్టి సులోచన బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెతోపాటు వారి కుమారుడు బట్టిసాయి మోహన్, ప్రముఖ న్యాయవాది పవన్ శ్రీకర్‌లు చేరారు. మంగళవారం మెదక్ పట్టణ నాయకులు కొండన్ సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు హైదరాబాద్‌లోని తన నివాసంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కాగా బట్టి సులోచన మూడు మార్లు కౌన్సిలర్‌గా కొనసాగారు. మంచి పట్టున్న లీడర్‌గా మెదక్ పట్టణానికి సుపరిచితురాలు. బట్టి సులోచన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆరోపించారు. తమ కుటుంబం స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబమని, తాము ఎల్లప్పుడూ ప్రజా శ్రేయస్సు కోసం పోరాడుతామని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని మెదక్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు.

## మాయమాటలు నమ్మవద్దు

**-పనిచేసే వారికే పట్టం కట్టాలి**

**-బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొంపల్లి మహేష్**



జగదేవ్‌పూర్, నవంబర్ 07, మనం న్యూస్ః ఎన్నికల సమయంలో మాయ మాట లు చెప్పి తర్వాత మోసం చేసే వారి మాటలు నమ్మవ ద్దని బిఆర్ఎస్ సీనియర్ నా యకులు కొంపల్లి మహేష్ అన్నారు. మండలంలోని ము నిగడప, వట్టిపల్లి, అలీరా జ్‌పేట, జగదేవ్‌పూర్‌తో పాటు వివిధ గ్రామాల్లో బిఆర్ఎస్ పార్టీకి అపూర్వ స్పందన లభి స్తుందన్నారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ బి ఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే బ్రిడ్జి, ఓవర్ హెడ్ ట్యాంక్, పాఠశాల నిర్మాణం, సిసి రోడ్లు, చెరువు కట్టల అభివృద్ధి జరిగిందన్నారు. 55 ఏళ్లుగా కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. రైతుబీమా తరహాలో బిఆర్ఎస్ ప్రభుత్వం రేషన్‌కార్డుదారులందరికీ ఉచితంగా రూ. 5 లక్షల బీమా సౌకర్యం అందించడం జరుగు తుంద న్నారు. అబద్ధాలు చెప్పే పార్టీకి ఓట్లు వేయద్దన్నారు. సీఎం కేసీఆర్‌తోనే గజ్వేల్ అభివృద్ధి అని, ఈసారి ఎన్నికల్లో మరోసారి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# బీజేపీకి ''బీ'' టీమ్‌గా బీఆర్ఎస్

- కాంగ్రెస్‌తో దోస్తీ కుదిరింది
- నేను శంకుస్థాపన చేసిన పనులే పూర్తి చేయ్యలేదు
- ప్రాజెక్టులను పూర్తి చేయలేని అసమర్ధ పాలకులు
- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, నవంబర్ 7,(మనం న్యూస్)ః బీజేపీకి బీఆర్ఎస్ ''బీ'' టీమ్‌గా మారిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సిపిఐ-కాంగ్రెస్ పార్టీల మధ్యన దోస్తీ కుదిరందని ఆయన స్పష్టం చేసారు. కొత్తగూడేం ఎమ్మెల్యే సీటుతో పాటు రెండు ఎమ్మెల్సీలతో పొత్తుకు ఓకే అయ్యిందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో సిపిఐ పార్టీనే అత్యధిక సార్లు గెలిచిందన్నారు. సాగునీరు, త్రాగునీరు, పక్కా ఇండ్లు ఇచ్చిన, కార్పొరేషన్ ద్వారా రుణాలు వచ్చిన ఎర్రజెండా పోరాటమేనని ఆయన గుర్తు చేసారు. 2004-2009 వరకు ఎమ్మెల్యేగా పని చేసినపుడు నేను శంకుస్థాపన చేసిన వరద కాలువలు పూర్తికాకపోవడం సిగ్గుచేటన్నారు. పదేండ్లు కావస్తున్న వరద కాలువలను పూర్తి చేయలేని అసమర్ధ పాలకులంటూ ఆయన మండిపడ్డారు. వరద కాలువలకు ఇప్పటి వరకు కూడా పూర్తి స్థాయిలో భూసేకరణ కాలేదని ఆయన ఆరోపించారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను సైతం పూర్తి చేయడంలో బీఆర్ఎస్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు గ్రీన్ ట్రిబ్యూనల్ పరిధిలోకి వెళ్ళి సీసీ కెమెరాలు సైతం అమర్చారని ఆయన తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటలను సీఎం కేసీఆర్ తప్పారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. రానున్న కాలంలో కాంగ్రెస్‌తో కలిసి అభివృద్ధి కోసం



పాటుపడుతామని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను గద్దె దించకపోతే ప్రజలకు కష్టాలు తప్పవని ఆయన తెలిపారు. జిల్లా ఎన్నికల నిర్వహాణ కన్వీనర్‌గా మంద పవన్ ఏకగ్రీవం అయ్యారన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళవేని శంకర్, సిద్ధిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపే మల్లేశ్, ఆదరి శ్రీనివాస్, సిపిఐ నాయకులు పాతిరెడ్డి వెంకటరెడ్డి, బోయిని అశోక్, యెడల వనేశ్, జాగీరి సత్యానారాయణ, కనుకుట్ల శంకర్, జేరిపోతుల జనార్ధన్, వెల్పుల శ్రీనివాస్, ముంజ గోపీ, నాగేల్ల లక్ష్మారెడ్డి, చాడ శ్రీధర్‌రెడ్డి, ఎలగందుల రాజయ్య, కొయ్యడ కొమురయ్య, అయిలేని సంజీవరెడ్డి, ఏగ్గోజు సుదర్శనచారి, తదితరులున్నారు.



## కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందిద్దాం

### ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్, నవంబర్ 07, మనం న్యూస్ః త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గం నుండి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందిద్దామని ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం రోజున గజ్వేల్ మండలం బూరుగుపల్లి గ్రామంలో సర్పంచ్ వంటేరు విజయవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ కేసీఆర్‌కు మద్ధతుగా ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి డప్పు చప్పుళ్లతో, ఒగ్గు కళాకారుల డోలు చప్పుళ్లతో మహిళలు బతుకమ్మలతో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని కుల సంఘాల పెద్దలు సీఎం కేసీఆర్‌కు మద్ధతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ముదిరాజ్, పద్మశాలి, గౌడ, మాదిగ, మాల, గొల్ల, వడ్రంగి, సంఘం నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేసి తీర్మాన పత్రాలను ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డికి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత గజ్వేల్ నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. మరోసారి కేసీఆర్‌ను హ్యాట్రిక్‌గా గజ్వేల్ నుండి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపిపి అమరావతి, జెడ్పిటిసి పంగా మల్లేశం, మండల పార్టీ అద్యక్షులు బెండ మధు, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి వలసలు



జగదేవ్‌పూర్, నవంబర్ 07, మనం న్యూస్ః జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూముకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారిని ఆయన పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రజలకు బిఆర్ఎస్ పాలన పట్ల విసుగు చెంది ఉన్నారని, కేసీఆర్ నిరంకుశ పాలన పట్ల ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతుందన్నారు. బిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్‌మాత్రమే అని, అందుకే బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేరుతున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలువడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కేశిరెడ్డి రవిందర్‌రెడ్డి, పిఎసిఎస్ మాజీ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు హన్మంతురెడ్డి, పీర్లపల్లి దర్మారం ఎంపిటిసి మహేందర్‌రెడ్డి, మాజీ కొండపోచమ్మ ఛైర్మన్ బత్తుల మల్లేశం, బంగార్‌రెడ్డి, ధర్మారం నర్సింహారెడ్డి, జుర్రు రాజు తదితరులు పాల్గొన్నారు.

# పొన్నం వ్యక్తిగత విమర్శలు మానుకో

- విమర్శకు ప్రతి విమర్శ చేస్తాం
- ఇక్కడి ప్రజలు ఎమ్మెల్యేగా సతీశ్‌నే గెలిపిస్తారు
- నేషనల్ లేబర్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్ దండుగుల రాజ్యలక్ష్మీ



హుస్నాబాద్,నవంబర్ 7,(మనం న్యూస్)ః పొన్నం ప్రభాకర్ వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకో లేదంటే విమర్శకు ప్రతి విమర్శ చేస్తామంటూ నేషనల్ లేబర్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్ దండుగుల రాజ్యలక్ష్మీ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దండుగుల రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్ గత రెండు రోజులుగా బీఆర్ఎస్ నాయకులు నన్ను ఇట్ల అన్నరు అట్ల అన్నరని నా మనసుకు బాధ అవుతుందంటూ ఎక్కువ ప్రచారం చేసుకుంటున్నారని ఆమె ఆరోపించారు. నాకు మాత్రం వినడానికి నవ్వు వస్తోందన్నారు. పొన్నంను విమర్శిస్తే మనసు బాధ కలిగితే ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను అంటే బాధ కలగదా అంటూ ఆమె ప్రశ్నించారు. వ్యక్తిగత విమర్శలకు తొలుత దారి తీసింది పొన్నం అనే ఆమె ఆరోపించారు. కరీంనగర్‌లో నిన్ను నమ్ముకున్న ప్రజలను నట్టేట ముంచి హుస్నాబాద్‌కు వచ్చావంటూ ఎద్దెవా చేసారు. ఓ సూట్‌కేసు పట్టుకొని వచ్చి నేను తెలంగాణ ఉద్యమం చేసినా అంటూ పోటోల ఆల్బమ్ చూపిస్తూ ప్రచారం చేసుకుంటున్నరన్నారు. ఎమ్మెల్యే సతీశ్ కుమార్ తెలంగాణ ఉద్యమం చేసిన ఫోటోలు, ఆయన చేసిన హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి పనులు చూపించాలంటే పెద్ద పెద్ద లారీలు అవుతాయన్నారు. హుస్నాబాద్ గడ్డ ప్రజలు చైతన్యవంతులు అని ఇక్కడ ప్రజలను ఏవరూ మోసం చేయలేరన్నారు. చిల్లరగా మాట్లాడటం స్టార్ట్ చేసింది పొన్నం ప్రభాకర్ అనే ఆమె అన్నారు. చిల్లర మాటలు మానుకొవాలని లేదంటే విమర్శకు ప్రతి విమర్శ చేస్తామని ఆమె హెచ్చరించారు. కరీంనగర్‌లో నువ్వు ఎట్టి పరిస్థితిలో చెల్లవని హుస్నాబాద్‌కు వచ్చావని అందరికీ తెలుసు అన్నారు. ఈ నియోజకవర్గ ప్రజలు కూడా తిరిగి పంపిస్తారని ఆమె పేర్కొన్నారు. సతీశ్‌కుమార్ పై విమర్శలు మానుకొని ప్రచారం చేసుకోవాలని ఆమె సూచించారు. ఇప్పటికైనా హుందాతనం రాజకీయాలు చేయాలన్నారు. కాంగ్రెసోళ్లు గాంధీ భవన్‌లో కుర్చీలు ఎగరవేసుకుని కొట్టుకుంటున్నారంటూ హేళన చేసారు. కరీంనగర్‌లో నిన్ను నమ్మని ప్రజలు హుస్నాబాద్‌లో అస్సలు నమ్మరన్నారు. ఇక్కడి ప్రజలు ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆమె స్పష్టం చేసారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సాంబరాజు, సాయన్న, శోభ, ప్రజా ప్రతినిధులు,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

## నిరుపేద మృతురాలి కుటుంబానికి అండగా బిఆర్ఎస్

కొండపాక, నవంబర్ 07, మనం న్యూస్ః నిరుపేద మృతురాలి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ ఆర్ధిక సహాయం అందించి అండగా నిలిచింది. కొండపాక మండల పరిధిలోని దుద్దెడ గ్రామానికి చెందిన నిరుపేద గురుకు సుగుణవ్వ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు గోనె శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు రూ. 10 వేల ఆర్ధిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా కమిటీ సభ్యులు దోమల ఎల్లం యాదవ్, తొగుట మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ మంచాల చిన్న శ్రీనివాస్, నాయకులు మిద్దె చంద్రమౌళి, చింతకింది రఘు, జీకురు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# బొమ్మకే బీజేపీ టికెట్

## బీసీ నాయకుడికే మొగ్గు చూపిన అధిష్టానం

## ప్రచారానికి సిద్ధం కానున్న బొమ్మ శ్రీరామ్

## ఈనెల 10 న నామినేషన్



హుస్నాబాద్,నవంబర్ 7,(మనం న్యూస్)ః హుస్నాబాద్ బీజేపీ టికెట్ ఉత్కంఠకు అధిష్టానం తెరదించింది. గత కొన్ని నెలల నుండి బీజేపీ పార్టీ నుండి ఎమ్మెల్యే టికెట్ కోసం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ సన్నిహితుడు మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్న కుమారుడు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటేల రాజేందర్ ప్రధాన అనుచరుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డిలు పోటీ పడ్డారు. మా సన్నిహితుడు బొమ్మకే టికెట్ ఇవ్వాలంటూ బండి సంజయ్‌కుమార్, నా ప్రధాన అనచరుడు జే.ఎస్.ఆర్.కే టికెట్ ఇవ్వాలంటూ ఇద్దరు అగ్రనేతలు అధిష్టానం పై ఒత్తిడి తీసుకురావడంతో నాలుగో జాబితా వరకు హుస్నాబాద్ స్థానాన్ని పెండింగ్‌లోనే ఉంచారు. మంగళవారం బీజేపీ విడుదల చేసిన నాలుగవ జాబితాలో బీసీ నాయకుడు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికే మొగ్గు చూపి టికెట్‌ను కేటాయించింది. టికెట్ కేటాయింపు ఆలస్యం అవ్వడంతో నామినేషన్‌కు కేవలం రెండు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ గౌడ్‌లు ప్రచారంలో దూసుకుపోతున్నారు. రేపటి నుండి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 30 న పోలింగ్ ఉండటంతో ప్రచారానికి మాత్రం కేవలం 20 రోజులు మాత్రమే మిగిలి ఉంది. 20 రోజుల్లో బీజేపీ అభ్యర్థి బొమ్మ శ్రీరాం అన్ని గ్రామాలను చుట్టేందుకు పక్కా ప్రణాళిక రచించుకున్నారు. బీజేపీ ప్రచారానికి అగ్రనేతలను సైతం తీసుకువచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ కుమార్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటేల రాజేందర్, దుబ్బాక తాజా మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, తదితరులను ప్రచారానికి తీసుకువచ్చి హుస్నాబాద్ గడ్డ పై కాషాయ జెండాను ఎగురవేసేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. తొలిసారి బొమ్మ శ్రీరాం చక్రవర్తి ఎమ్మెల్యేగా పోటీ చేస్తుండటంతో అందరి చూపు అతని పైనే ఉంది.




## నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

### రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



సిద్దిపేట, నవంబర్ 07, మనం న్యూస్ ప్రతినిధిః ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర డిజిపి అంజనీకుమార్, ఎన్నికల పరిశీలకులు, ఇతర రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్, సిపి శ్వేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ అనంతరం అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన ఈవియం యంత్రాల సర్దుబాటు ఉంటుందన్నారు. పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులు మూడు రోజుల వ్యవధిలో పరిష్కరించాలన్నారు. ఎన్నికల తనిఖీలలో భాగంగా నగదు, బంగారం, ఇతర ఆభరణాలు జప్తు చేసే సమయంలో ఈఎస్ఎంఎస్ యాప్‌లో క్షేత్రస్థాయిలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించి పోలింగ్ శాతం పెరిగే విధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో నోడల్ అధికారిని నియమించి ప్రతి రోజు ఓటరు స్లిప్పుల పంపిణీపై సమీక్ష నిర్వహించాలన్నారు.

## నాయిబ్రాహ్మణులకు సంక్షేమ పార్టీ బిఆర్ఎస్



సిద్దిపేట, నవంబర్ 07, మనం న్యూస్ ప్రతినిధిః నాయిబ్రాహ్మణులకు సంక్షేమ పార్టీ బిఆర్ఎస్ పార్టీయే అని సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కోత్వాల్ యాద నరేందర్ అన్నారు. మంగళవారం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజనర్సు, కొండం సంపత్‌రెడ్డి, పాల సాయిరామ్, మోహన్‌లాల్ ఆధ్వర్యంలో నాయిబ్రాహ్మణులందరూ ఏకగ్రీవంగా బిఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మాణాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యాద నరేందర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంతో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాయని, బంగారు తెలంగాణ బిఆర్ఎస్‌తోనే సాధ్యమని హరీష్‌రావుకు మద్దతు తెలుపుతూ లక్ష యాభైవేల పై చిలుకు భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సూరంపల్లి నర్సింలు, ఏల్పుల స్వామి, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కోత్వాల్ చంద్రం, కోత్వాల్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

## పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికి సముచిత స్థానం

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్



హుస్నాబాద్,నవంబర్ 7,(మనం న్యూస్)ః బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతోందని హుస్నాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్ అన్నారు. సతీశ్ కుమార్ వెంటే మేమంతా అంటూ అక్కనపేట మండల బిఎస్‌పి మండల అధ్యక్షుడు అరవింద్ అతనితో పాటు 20 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. చౌటపల్లి గ్రామం నుండి 20 మంది కాంగ్రెస్ పార్టీని వీడి గులాబీ కండువాను కప్పుకున్నారు. భీమదేవరపల్లి నుండి గౌడ సంఘం నాయకులు 20 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పొట్లపల్లి గ్రామం నుండి వివిధ పార్టీల నుండి 10 మంది నాయకులు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి హుస్నాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ గులాబీ పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో అమల్లోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన వివరించారు. ఆసరా పింఛన్లు పెంపు, సన్నబియ్యం పంపిణీ, రూ.400 కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ పరిమితి రూ.15 లక్షలకు పెంపు వంటి పథకాలు నిరుపేదలకు ఎంతో మేలు చేయనున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కనపేట జడ్పీటీసీ భూక్య మంగ, ఎంపీపీ మాలోతు లక్ష్మీ, నేషనల్ లేబర్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్ దండుగల రాజ్యలక్ష్మీ, శోభ, సాంబరాజు, సాయన్న, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

# కొనసాగుతున్న నామినేషన్‌ల ప్రక్రియ

## నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ

సిద్దిపేట, నవంబర్ 07, మనం న్యూస్ ప్రతినిధిః రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నియోజకవర్గంలో చిన్నకోడూరు మండల






పరిధిలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన ధర్మాజీపేట ప్రతాప్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా, చిన్నకోడూరు మండల పరిధి కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన పిల్లి సాయికుమార్ స్వతంత్ర అభ్యర్థిగా, పట్టనానికి చెందిన పైసా రామకృష్ణ స్వతంత్ర అభ్యర్థిగా, కాంగ్రెస్ పార్టీ తరుపున పట్టణానికి చెందిన పూజల హరికృష్ణ, పట్టణానికి చెందిన జక్కుల సత్యనారాయణ స్వతంత్ర అభ్యర్థిగా మంగళవారం నామినేషన్‌లు వేశారు.

# నా బలం బలగం మీరే



**-దుబ్బాక ప్రజలే నా గొంతు**

**-గూండాగిరి చేయలే.. ప్రేమతో గెలిచిన..అభివృద్ధి చేసిన**

**-హరీష్‌రావు నటకు ఆస్కార్ ఇవ్వాలె**

**-దుబ్బాక బీజేపి అసెంబ్లీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు**

దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 07, మనం న్యూస్ః పుట్టింది దుబ్బాక గడ్డమీదనే, చచ్చినా దుబ్బాక గడ్డమీదనే..కానీ ఎవరో వచ్చి దుబ్బాక మీద పెత్తనం చెలాయిస్తూ దుబ్బాక ప్రజలను అణివేతకు గురిచేస్తే మాత్రం చూస్తూ ఊరుకోనని, నా బలం బలగం అంతా మీరేనని దుబ్బాక నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు స్పష్టం చేశారు. రఘునందన్‌రావు ఎవరి బెదిరింపులకు భయపడడని, రఘు నందన్ రావు పైసలను కాదు, ప్రజలను నమ్ముకున్నాడన్నారు. మంగళవారం రోజున అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మాజీ ఎంపి జితేందర్‌రెడ్డి, బీజేపి జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రాతో కలిసి ఆయన నామినేషన్ దాఖలు చేసిన అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోచమ్మ దేవాలయ సమీపంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ 2014లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ నాటి నుండి 2020 వరకు దుబ్బాకలో చేయలేని పనులను కేవలం రెండున్నరేళ్లలో ప్రభుత్వం మెడలు వంచి పూర్తి చేయడం జరిగిందన్నారు. ఏడేళ్లుగా ఎంపిగా ఉన్న కొత్త ప్రభాకర్‌రెడ్డి ఏడేళ్లలో ఏనాడైనా దుబ్బాకకు గానీ, గ్రామాలకు గానీ వచ్చాడా, ఎంపి నిధుల నుండి దుబ్బాక అభివృద్ధికి ఏం చేశాడో చెప్పగలడా అని ప్రశ్నించారు. దుబ్బాక ప్రజలే గొంతుకగా గత ఉప ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీలో రేషన్ కార్డుల గురించి ప్రశ్నించిన ఏకైక ఎమ్మెల్యే తానే అన్నారు. బిఆర్ఎస్ పార్టీకి ఓటేయకపోతే పథకాలు అందవి అని బిఆర్ఎస్ నాయకుల మాదిరిగా తాను గూండాగిరి చేసి గెలవలేదని, దుబ్బాక నియోజకవర్గ ప్రజల ప్రేమ, ఆశీస్సులతో గెలిచానని, అదే ప్రేమను వారికి అభివృద్ధి రూపంలో అందిస్తున్నానన్నారు. ఎంపిగా ఉన్న వ్యక్తికి పటాన్‌చెరు నియోజకవర్గంలోని లకుడారం గ్రామాన్ని దత్తత తీసుకున్నప్పటికీ ఆ గ్రామంలో ఏ ఒక్క పని కూడా చేయలేదని, నేడు ఆ గ్రామ రైతులంతా అక్కడి ఎమ్మెల్యేను వేడుకుంటున్న పరిస్థితి దాపురించిందని, ఎంపికి దుబ్బాక నియోజకవర్గంలో దత్తత తీసుకునేందుకు ఏ గ్రామం దొరకలేదా అని ఎద్దేవా చేశారు. ఏడేండ్లు ఎంపిగా ఉండి ఏమీ చేయని వ్యక్తి నేడు ఎమ్మెల్యేగా గెలిపించండి అని ప్రజల్లోకి రావడం సిగ్గుచేటన్నారు. ఓ వైపు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా కనీసం నిరుద్యోగుల కోసం ఉద్యోగాల భర్తీ కూడా చేపట్టలేకపోవడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. పదేళ్లలో డిఎస్సీ ద్వారా ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదని, గ్రూప్ -1, గ్రూప్ - 2 పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేకపోవడంతో నిరుపేద కుటుంబానికి చెందిన సోదరి ప్రవళిక మరణిస్తే ఆసుపత్రికి పరుగెత్తని మంత్రి హరీష్‌రావు, దుబ్బాకకు ఏమీ చేయని వ్యక్తి కోసం ఆసుపత్రికి ఏదో అయినట్లుగా హడావిడిగా పరుగెత్తడం చూస్తుంటే హరీష్‌రావుకు ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సిందే అనిపిస్తుందని విమర్శించారు. దుబ్బాకకు రఘునందన్‌రావు గెలిచిన తర్వాత ఏం చేశాడని ఎవరైనా అడగాలనుకుంటే నియోజకవర్గ రోడ్లపై నడవాలని, దుబ్బాక బస్టాండ్‌లో సేద తీరాలని, మెరుగైన వైద్యం కోసం 24 గంటల్లో ఎప్పుడైనా దుబ్బాక ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలని, సొంతిల్లు లేక డబుల్ బెడ్‌రూమ్‌లలో ఉంటున్న సోదరీమణులను అడిగితే దుబ్బాకకు ఏం చేశానో తెలుస్తుందన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వలేని, రైతులకు రైతు రుణమాఫీ చేయలేని, దళితబంధు, బిసిబంధు అమలు చేయలేని మంత్రి కేటీఆర్, హరీష్ రావులు దుబ్బాకలో పెత్తనం చెలాయించేది ఏమీ లేదని, ఏ ముఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకులకు ఉన్న బలం పోలీసు బలం, డబ్బు బలం తప్ప ప్రజా బలం లేదని, తనకు నియోజకవర్గ ప్రజాబలం పూర్తిగా ఉందని, ఆ బలం బలగమే తనను ఈసారి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తుందన్నారు. కావున దుబ్బాక నియోజకవర్గ ప్రజలంతా మరోసారి ఐదేళ్ల పాటు పూర్తి అవకాశమిస్తే ప్రభుత్వం మెడలు వంచి, ప్రభుత్వాన్ని నడిపించుకొనైనా దుబ్బాకకు నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## పోలింగ్ సామాగ్రిని పరిశీలించిన కలెక్టర్



సిద్దిపేట రూరల్, నవంబర్ 07, మనం న్యూస్ః తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ కలెక్టరేట్ కార్యాలయంలోని శాసన సభ ఎన్నికలకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పలు గదులను మంగళవారం పరిశీలిం చారు. నాలుగు నియోజకవర్గాల పోలింగ్ బూత్‌ల సామాగ్రితోపాటు వాల్‌పోస్టర్లు, పాంప్లెట్లు వంటి ఇతర సామాగ్రిని పరిశీలించారు. ఎస్ఎస్‌టి చెక్‌పోస్టు వెబ్‌కాస్టింగ్ , సెక్టోరియల్ ఆఫీసర్ల వాహనాల జిపిఎస్ ట్రాకింగ్ ఎల్లప్పుడూ ఈడియం ఆనంద్‌కు తెలిపారు. కలెక్టర్ ప్రాంగణం చుట్టూ శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ రహమాన్, ఎన్నికల సూపరిండెంట్ రామేశ్వర్ తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ నుండి రాజేష్ సస్పెండ్

సిద్దిపేట రూరల్, నవంబర్ 07, మనం న్యూస్ః సిద్దిపేట నియోజకవర్గం నారాయణరావుపేట మండలంలోని మాటిండ్ల గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శేఖర్‌రావుపేట గ్రామానికి చెందిన మునిగల రాజేష్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య తెలిపారు. పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ దృష్టికి రావడంతో మంత్రి హరీష్‌రావు ఆదేశాలకు అనుగుణంగా రాజేష్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

## బిఆర్ఎస్‌వి రాష్ట్ర నేతల నియామకం



సిద్దిపేట అర్బన్, నవంబర్ 07, మనం న్యూస్ః సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన విద్యార్థి నేతలను మంత్రి హరీష్‌రావు రాష్ట్ర స్థాయిలో నియమించారు. రాష్ట్ర బిఆర్ఎస్‌వి ఉపాధ్యక్షులుగా నవీన్ గౌడ్, సిద్దిపేట నియోజకవర్గ విద్యార్థి యువత ఎన్నికల సమన్వయకర్తగా మేరుగు మహేష్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షునిగా రెడ్డి యాదగిరి ముదిరాజ్‌ను మంత్రి హరీష్‌రావు నియమించారు. ఈ సందర్భంగా పార్టీ విద్యార్థి యువత బలో పేతానికి కృషి చేయాలని తెలిపారు.





# అవ్వా... నీ పెద్దకొడుకు కేసీఆర్‌ను ఆశీర్వదించు

**వృద్ధులతో ముచ్చటించిన జగదేవ్‌పూర్ ఇంచార్జ్ రాధాకృష్ణ శర్మ**



జగదేవ్‌పూర్, నవంబర్ 07, మనం న్యూస్ః అవ్వ.. నీ పెద్ద కొడుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, గజ్వేల్ నియోజకవర్గ అభ్యర్థి కేసీఆర్ మళ్లీ సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడు. నీ మద్ధతిస్తూ మీ పెద్ద కొడుకును ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని ఎన్నికల ఇంచార్జ్ మండల ఇంచార్జ్ రాధాకృష్ణశర్మ అన్నారు. మండల పరిధిలోని అలీరాజ్‌పేట, నిర్మల్‌నగర్ గ్రామంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్, ఎంపిటిసి రమ్య రవి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ హాజరై మాట్లాడారు. గజ్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కేసీఆర్ పోటీ చేస్తున్నారని మీ పెద్ద కొడుకును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రాచర్ల నరేష్, రాధాకృష్ణశర్మలు వృద్ధులతో మాట్లాడుతూ అవ్వా... ఎలా ఉన్నావు. బాగున్నావా అంటూ అక్కున చేర్చుకొని మీ పెద్ద కొడుకు కేసీఆర్‌కు ఈసారి ఎన్నికల్లో ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ఎంపిటిసి రమ్య రవి, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్‌రెడ్డి, సత్తిరెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఎంపిపి బాలేశం గౌడ్, జెడ్పిటిసి సుధాకర్‌రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ ఛైర్మన్ గుండా రంగారెడ్డి, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు రాచర్ల నరేష్, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షులు కావ్య దర్గయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**-భవిష్యత్తుకు తరగతిగదిలోనే నాంది వేసుకోవాలి**

**-పాఠశాలలను సందర్శించిన డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి**



దౌల్తాబాద్, నవంబర్ 07, మనం న్యూస్ః సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూరంపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల అసెంబ్లీకి హాజరైన అనంతరం నాలుగవ తరగతి విద్యార్థులను తెలుగు, ఆంగ్లం చదివించి, గణిత సమస్యలను విద్యార్థులచే పరిష్కరించమని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కిచెన్, గార్డెన్ పరిశీలించారు. అదేవిధంగా దొమ్మాట జెడ్పిహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి తరగతి గది నిర్వహణ పరిశీలించి పదవ తరగతి విద్యార్థులతో పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలనే అంశంపై వివరించి ప్రత్యేక తరగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి ఫలితాల్లో సిద్దిపేట జిల్లా మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం దొమ్మాట జెడ్పిహెచ్ఎస్ బాలుర, బాలికల, కేజిబివి, మోడల్ స్కూల్‌తోపాటు పలు పాఠశాలలను సందర్శించి విద్యార్థులను తెలుగు, ఆంగ్లం, గణితం సంబంధిత అంశాలపై పరిశీలించి పలు సూచనలు చేశారు. టి. నిశాంత్ అనే అబాయబని ఆంగ్లం చదివించినపుడు సార్.. అని సంభోదిస్తూ మీ నాన్న ఏం చేస్తాడు...? అని అడగగా వ్యవసాయం అని తెలిపాడు ఆ విద్యార్థి. వెంటనే డిఈఓ భవిష్యత్తులో ఏమవుతావు? అని అడిగగా కలెక్టర్ అవుతానని విద్యార్థి సమాధానం ఇవ్వగా సంతోషిస్తూ విద్యార్థిని డిఈఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నర్సవ్వ, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రాజు, చంద్రమౌళి పాల్గొన్నారు.

